ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 17 మే 2024

పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డు

జీవీఎంసీ కార్యాలయంలోనే ఏర్పాటు

- రోజుకు 80 టన్నుల చెత్త డంపింగ్
- దుర్వాసనతో జనం ఇక్కట్లు
- దోమలు స్వైరవిహారంతో కునుకు తీయని స్థానికులు
- వర్షం పడితే నరకయాతనే..

.. వివరాలు 7వ పేజీలో

బటన్ నొక్కినా డబ్బులు పడలేదు

రెండు నెలలుగా చేయూత లబ్ధిదారుల ఎదురుచూపులు

- ఎన్నికల ముందు హడావిడి చేసిన వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుతం మిన్నకుండడంపై విమర్శలు


అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలో చేయూత నిధులు విడుదల సందర్భంగా బటన్ నొక్కుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చేయూత పథకం నగదు విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. చేయూత నిధుల విడుదలకు సీఎం జగన్ బటన్ నొక్కి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మహిళల ఖాతాల్లోకి డబ్బులు జమ కాలేదు. వారంతా ఆ డబ్బులు ఎప్పుడొస్తాయా? అని ఎదురు చూస్తున్నారు. రెండు నెలలుగా బ్యాంకులకు వెళ్లి ఖాతాల్లో డబ్బులు పడ్డాయా? అని ఆరా తీసిన అనేక మంది మహిళలకు నిరాశే ఎదురైంది. ఎన్నికల ముందు ఖాతాల్లో డబ్బులు వేస్తామని హడావిడి చేసిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు మిన్నకుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనకాపల్లి జిల్లాలోనే పిసినికాడలో ఈ ఏడాది మార్చి 7న చేయూత నిధులు విడుదల చేస్తూ సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. ఆ రోజు నుంచి 14 రోజుల పాటు చేయూత నిధులు బ్యాంకుల్లో జమ అవుతాయని వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు. ఎన్నికల సంఘం మార్చి 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో బ్యాంకుల్లో నిధుల జమ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. వాస్తవానికి ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా గొప్పలకు పోయి అట్టహాసంగా బటన్ నొక్కి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడతాయని హడావిడి చేసింది. జిల్లాలో 45 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుపేద మహిళలకు ఏటా ప్రభుత్వం రూ.18,750 చొప్పున చేయూత పథకం కింద ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది. అయితే ప్రభుత్వం ఈసారి నాలుగో విడత కింద జిల్లాలో 1,17,805 మంది లబ్ధిదారులకు రూ.220.88 కోట్లు బ్యాంకుల్లో జమ చేయాల్సి వుంది. కానీ రెండు నెలలు కావస్తున్నా ఒక్క మహిళ ఖాతాలో కూడా నగదు జమ కాకపోవడంతో చేయూత అందుతుందనే ఆశలు లబ్ధిదారుల్లో సన్నగిల్లుతున్నాయి. దీనిపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ డౌనీ మాట్లాడుతూ చేయూత నిధుల విడుదలకు ఇబ్బందులు లేవని, ఒకటి రెండు రోజుల్లో మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతాయని స్పష్టం చేశారు.

గెడ్డ వాగులనూ మింగేశారు!



వెదుళ్లనరవలో రెచ్చిపోతున్న అక్రమార్కులు

- జిరాయితీలో కలిపేసి ప్లాట్లు వేసి విక్రయం
- గతంలో కూల్చివేసిన కొన్నిచోట్ల మళ్లీ నిర్మాణాలు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు


వెదుళ్లనరవ సర్వే నంబరు 77/2లో గెడ్డ వాగును ఆక్రమించి చదును చేసిన దృశ్యం

సబ్బవరం, మే 16:

మండలంలో అక్రమార్కులకు అడ్డే లేకుండాపోయింది. ప్రభుత్వ భూములు, గెడ్డ వాగులను కూడా దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధి వెదుళ్లనరవలో గెడ్డ వాగులను కప్పేసి చదును చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


వెదుళ్లనరవ సర్వే నంబరు 76లో గెడ్డ వాగును ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

వెదుళ్లనరవ సర్వే నంబరు 77/2లో 1.08 ఎకరాలు గెడ్డ వాగు ప్రభుత్వ భూమి ఉంది. ఆ గెడ్డ వాగును ఆనుకొని సర్వే నంబర్లు 78, 79లలో ప్రైవేటు భూమి ఉంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ గెడ్డ వాగును ఇటీవల కప్పేసి చదును చేసేశారు. అదే విధంగా సర్వే నంబర్లు 76, 77లను కలుపుతూ సర్వే నంబరు 98లో 2.85 ఎకరాల గెడ్డ వాగు ఉంది. గతంలో దీనిని ఆక్రమించి ప్లాట్లుగా వేసి కొంతమంది అమ్మేశారు. దీనిలో నిర్మాణాలు కూడా జరిగిపోయాయి. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో అధికారులు అప్పట్లో అక్కడి నిర్మాణాలను కూల్చివేశారు. కొన్ని నెలల తరువాత మళ్లీ అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించగా స్థానికుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. అయితే ఇప్పుడు నిర్మాణాలు చేపట్టేందుకు మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

సర్వే నంబరు 76లో కూడా..

వెదుళ్లనరవ సర్వే నంబరు 76లో 2.2 ఎకరాల గెడ్డ వాగు ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నంబరును ... మిగతా 8వ పేజీలో

ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దు

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి

- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ విశాల్ గున్నీ


హాజరైన పోలీసు అధికారులు

విజయనగరం క్రైం, మే 16:

ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దని, కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను విశాఖ రేంజ్ డీ ఐజీ విశాల్ గున్నీ ఆదేశించారు. గురువారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధి కారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా, క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా సిబ్బంది విధులు నిర్వహించడంతో చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. మరో 18 రోజులు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో చురుగ్గా ఉన్న వ్యక్తులను, రాజకీయంగా వివాదాలు సృష్టించే వ్యక్తులను గుర్తించి పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వ్యక్తులతో ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటే అలాంటి వారిని గుర్తించాలన్నారు. ఆయా గ్రామాల్లో పరిస్థితులు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. వివాదాలకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి నిరంతరం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వచ్చే నెల 4న కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతలను ఏర్పాటు చేయాలని ఎస్పీలను ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం ఎస్పీ దీపిక, పార్వతీపురం-మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ, అల్లూరి సీతారామరాజు ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీలు అస్మాపరహీన్, ప్రేమ్ కాజల్, దిలీప్ కిరణ్, సుసీల్ షరోన్, ట్రైనీ ఐపీఎస్ జావలి, డీఎస్పీలు శ్రీనివాసరావు, గోవిందరావు, చక్రవర్తి, మురళీధర్, జీవీ కృష్ణారావు, అప్పలరాజు, అప్పారావు, కేవీ సత్యనారాయణ, బాలచంద్రారెడ్డి, సునీతా, నాగేశ్వరరెడ్డితో పాటు ట్రైనీ డీఎస్పీలు మహీంద్ర, సీహెచ్ రాజా, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోరుగా బెట్టింగ్

ఉమ్మడి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో ఫలితాలపై అందరి దృష్టి

- మరికొన్ని నియోజకవర్గాల్లో మెజారిటీలపైనే...
- రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై అక్కడక్కడా పందాలు
- కూటమి వైపు అత్యధికులు మొగ్గు
- ప్రస్తుతం 2:1 రేషియోలో జరుగుతున్న పందాలు
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ స్థానాల్లో వైసీపీ గెలుపుపై బెట్టింగ్‌కు ఎవరూ ముందుకు రాని పరిస్థితి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటర్ల తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. వచ్చే నెల నాలుగో తేదీన అభ్యర్థుల భవితవ్యం వెల్లడి కానున్నది. విజయం ఎవరిని వరిస్తుందనే చర్చ సర్వత్రా నడుస్తోంది. మరోవైపు గెలుపోటములపై బెట్టింగ్ జోరందుకుంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, మెజారిటీలపై బెట్టింగ్ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఎవరు ఏర్పాటుచేస్తారనే దానిపై కూడా అక్కడక్కడా పందేలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని ఎక్కువ మంది పందాలకు ఎగబడుతుండడంతో 2:1 నిష్పత్తిలో బెట్టింగ్ జరుగుతోంది.

ఈనెల 13న పోలింగ్ ముగిసింది. వచ్చే నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది. పోలింగ్ సరళిని బట్టి ఎవరికి వారు తమకు తోచింది చెబుతున్నారు. తమ అంచనాలను వెల్లడిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో విజయం ఏకపక్షమేనని ప్రచారం జరుగుతుండగా, మరికొన్ని నియోజక వర్గాలపై మాత్రం ఒక అంచనాకు రాలేకపోతున్నారు. విశాఖ ఉత్తరం, పశ్చిమ, మాడుగుల, పెందుర్తి వంటి నియోజక వర్గాలపై ఎక్కువ పందాలు సాగుతున్నాయి. భీమిలి, గాజువాక, విశాఖ 'సౌత్' వంటి నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చే మెజారిటీపై బెట్టింగ్ కడుతున్నారు. ఈ అంశాల్లో రెండు వర్గాలు సమాన మొత్తంలో బెట్టింగ్ కడుతుంటే, రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు అంశంపై మాత్రం 2:1 నిష్పత్తిలో బెట్టింగ్ జరుగుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేయడం ఖాయమని ప్రచారం జరుగుతుండడంతో బెట్టింగ్ కట్టేందుకు రెండో వైపు నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కూటమి అధికారం దక్కించుకుంటుందని భావిస్తున్నవారు రెండొంతులు తమ వాటాగా, ఒక వాటా వైసీపీ వైపు బెట్టింగ్ కాసేవారిని పెట్టుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వస్తుందనేవారు రెండు వాటాలు, వైసీపీ అధికారంలోకి వస్తుందని భావిస్తున్న వారంతా ఒక వాటా...అంటే 2:1 రేషియోలో పందాలు సాగుతున్నాయి. వైసీపీకి వచ్చే ఎంపీ స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. ఏడుకు మించి రావని పలువురు బెట్టింగ్ కాస్తున్నారు. ఇది వచ్చే నెల నాలుగో తేదీ నాటికి మరింత తారస్థాయికి చేరే అవకాశం ఉందని రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపుపై ఎవరూ బెట్టింగ్ కాసేందుకు రావడం లేదని అంటున్నారు.

విద్యాశాఖలో షోకాజ్ నోటీసుల కలకలం

డీఈవోతో పాటు 227 మంది హెచ్‌ఎంలకు జారీ

- నాడు- నేడు పనుల్లో జాప్యంపై వివరణ ఇవ్వాలని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశం


చీడికాడ మండలం ఖండివరం హైస్కూల్ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణం

అనకాపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి):

జిల్లా విద్యాశాఖలో షోకాజ్ నోటీసుల జారీ కలకలం రేపుతోంది.. మనబడి నాడు- నేడు పథకం రెండవ విడత కింద పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనుల్లో జాప్యంపై వివరణ ఇవ్వాలంటూ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మతో పాటు జిల్లాలో 227 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయ వర్గాలను కలవరపాటుకు గురి చేసింది. జిల్లాలో నాడు-నేడు పథకం రెండవ విడత కింద గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో మేజర్, మైనర్ మరమ్మతు పనులతో పాటు అదనపు తరగతుల గదుల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నిర్మాణ పనులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల కమిటీల పర్యవేక్షణలో జరగాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం చేసిన పనులకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో మంజూరైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో ఈ పనులు పడకేశాయి. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పూర్తి కావాల్సిన నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మకు పాఠశాల విద్యాశాఖ కార్యాలయం నుంచి నోటీసులు జారీ అయ్యాయి. దీనికి ఆమె ఏడు రోజుల్లో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు వివరణ ఇవ్వాల్సి ఉండడంతో జిల్లాలో వేర్వేరు మండలాల్లో నాడు-నేడు నిర్మాణ పనుల్లో బాగా వెనుకబడిన 227 మంది ప్రధానోపాధ్యాయులకు పాఠశాల ... మిగతా 8వ పేజీలో

రైలు ప్రయాణికుల అవస్థలు

పలు రైళ్ల రద్దుతో ఇబ్బందులు

గంటల తరబడి రైల్వే స్టేషన్‌లో పడిగాపులు



అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, మే 16:

పలు రైళ్ల రద్దుతో ప్రయాణికులు గురువారం అవస్థలు పడ్డారు. అనకాపల్లి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయవాడలో భద్రతా చర్యల పనుల్లో భాగంగా నిత్యం ప్రయాణికులకు అందుబాటులో ఉండే గుంటూరు - రాయగడ, గుంటూరు - విశాఖ, మచిలీపట్నం- విశాఖ, రాజమహేంద్రవరం -విశాఖ, కాకినాడ పోర్టు- విశాఖ రైళ్లు రద్దయ్యాయి. కాకినాడ పోర్టు నుంచి విశాఖకు వచ్చే పాసింజర్, మచిలీపట్నం - విశాఖ ఎక్స్‌ప్రెస్ గత కొద్ది రోజులుగా రద్దు జాబితాలో ఉంది. విశాఖ - గుంటూరు, గుంటూరు - విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి రద్దు కాగా, గుంటూరు - రాయగడ, రాయగడ - గుంటూరు రైళ్లు గురువారం నుంచి రద్దయ్యాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. అలాగే రాజమండ్రి- విశాఖ, విశాఖ- రాజమండ్రి పాసింజర్ కూడా బుధవారం నుంచి రద్దయ్యింది. ఈ రైళ్లు ఇటు విశాఖ, అటు తుని - అన్నవరం వెళ్లే ప్రయాణికులకు ఎంతో అందుబాటులో ఉండేది. ఉదయం వేళ అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి వేలాది మంది ఇటు విశాఖకు, అటు విజయవాడ వైపు ప్రయాణం సాగిస్తుంటారు. అయితే ఈ రైళ్లు లేకపోవడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం వేళల్లో ఏడు గంటలకు గుంటూరు నుంచి వచ్చే రాయగడ ఎక్స్‌ప్రెస్ విశాఖకు వెళ్లేందుకు ప్రయాణికులకు అందుబాటులో ఉండేది. విశాఖలో పనులు ముగించుకున్న అనంతరం రాయగడ నుంచి గుంటూరు వెళ్లే రైలులో రాత్రి 8.20 గంటలకు అనకాపల్లికి చేరుకుని ఇంటి ముఖం పట్టేవారు. అదే విధంగా ఉదయం వేళల్లో చిరు వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, చిరు ఉద్యోగులు, విద్యార్థులు, ఫైనాన్షియర్లు, సామాన్య ప్రజలకు కాకినాడ పోర్టు నుంచి విశాఖకు వెళ్లేందుకు 8.15 గంటలకు అందుబాటులో ఉండేది. తిరిగి విశాఖ నుంచి సాయంత్రం ఆరు గంటల సమయంలో అన్ని వర్గాల ప్రయాణికులకు ఈ రైలు అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఈ రైలు కూడా నిలిచిపోయింది. కాకినాడ రైలు రద్దు కావడంతో విశాఖకు వెళ్లేందుకు కడప నుంచి విశాఖకు వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. అయితే ఈ రైలు తొమ్మిది గంటల సమయంలో అనకాపల్లికి చేరుకోవాల్సి ఉన్నప్పటికీ ఎప్పుడూ సమయానికి రాదని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ రైలు తరువాత విశాఖకు వెళ్లే మార్గంలో 12 గంటలకు బొకారో ఎక్స్‌ప్రెస్ వచ్చినప్పటికీ ఈ రైలు జనరల్ బోగీలు రద్దీగా ఉండడంతో పాటు రిజర్వేషన్ బోగీల్లో కూడా ప్రయాణికులు గేట్ల వద్ద ఉండడంతో ప్రయాణికులు రైలు ఎక్కేందుకు పెద్దగా ఆసక్తి చూపించిన దాఖలాలు లేవు. బొకారో తరువాత మధ్యాహ్నం రెండున్నర గంటలకు అనకాపల్లి జిల్లా వాసులకు సింహాద్రి ... మిగతా 8వ పేజీలో

అధ్వానంగా స్టేషన్ రోడ్డు

- అడుగడుగునా గోతులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు


రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఇలా..

అనకాపల్లి టౌన్, మే 16:

జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలోని చోడవరం రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే నాయుళ్లవీధి రహదారిలో ప్రయాణం నరకంగా మారింది. రహదారి దెబ్బతిన్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రోడ్డు ఆరంభంలోనే గోతులమయమైంది. నాయుళ్లవీధి నుంచి లక్ష్మీదేవిపేట రైల్వేగేటుకు వెళ్లే జంక్షన్‌లో మరింత అధ్వానంగా మారింది. రాళ్లు తేలడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. గూడ్స్‌షెడ్డు వద్ద రోడ్డు మధ్యలో పెద్దగొయ్యి పడటంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రైల్వేస్టేషన్, రింగురోడ్డు మీదుగా పట్టణ ప్రధాన రహదారికి చేరుకోవడానికి పట్టణ వాసులతో పాటు చోడవరం, మాడుగుల నియోజకవర్గాల వారు, అల్లూరి జిల్లా వాసులకు ఇదే ప్రధాన రహదారి. ఇటీవల జీవీఎంసీ అధికారులు పైపులైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన తవ్వకాలు రోడ్డును మరింత దుర్భరంగా మార్చాయి. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే వరకు గోతులు పడ్డాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ముఖ్యమైన రహదారిని పట్టించుకోకపోవడం పట్ల ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రహదారిని మెరుగుపరచాలని కోరుతున్నారు.


దెబ్బతిన్న నాయుళ్లవీధి రోడ్డు

క్రైం... crime news

ఎన్‌జీపాలెం వద్ద రోడ్డు ప్రమాదం

» లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు » ఐదుగురికి స్వల్ప గాయాలు



సంఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

కశింకోట, మే 16: మండలంలోని నూతనగుంటపాలెం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు గాయపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ రమణమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడ నుంచి శ్రీకాకుళం వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు మండలంలోని ఎన్‌జీ పాలెం రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపానికి వచ్చేసరికి అదే రోడ్డులో ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగమంతా నుజ్జునుజ్జయింది. బస్సులో ప్రయాణిస్తున్న అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన ఎం.ఈశ్వర్, పి.పెంటారావు, కనుమూరి నాగమూర్తి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆర్.అనురాధ, రేగాని కృష్ణ స్వల్పంగా గాయపడ్డారు. వీరు అనకాపల్లి ప్రభుత్వాసుపత్రిలో ముగ్గురు, ప్రైవేటు ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ఆమె తెలిపారు.

ఏలేరు కాలువలో మృతదేహం లభ్యం



ఏలేరు కాలువలో తేలుతున్న మృతదేహం

కశింకోట, మే 16 : మండలంలోని తీడ వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉన్న వ్యక్తి నలుపురంగు ఆఫ్ ప్యాంటు, తెలుపురంగు షర్టు ధరించి ఉన్నాడు. మృతుడు ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో పడిపోయి ఉంటాడా.. లేదా ఆత్మహత్య చేసుకున్నాడా అనే అంశంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. తీడ వీఆర్‌వో నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ దొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో ఉన్న మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు కశింకోట పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మాజీ వలంటీర్‌పై దాడి ఘటనలో తొమ్మిది మంది అరెస్టు

నర్సీపట్నం అర్బన్, మే 16: మండలంలోని ధర్మసాగరంలో మాజీ గ్రామ వలంటీర్‌పై దాడి చేసిన ఘటనలో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ భీమరాజు గురువారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో గ్రామంలో ఓటరు స్లిప్పులను మాజీ వలంటీర్ పి.రాజాలక్ష్మి పంపిణీ చేయడంతో అదే గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మంగళవారం రాత్రి దాడి చేసి, అసభ్యకరంగా ప్రవర్తించారంటూ బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులు రెడ్డి రాజేష్, రెడ్డి సాయి, అల్లు రాజు, సుకల రాజేష్, కామిరెడ్డి శివ, నందిపల్లి బోల్‌నాయుడు, వానపల్లి రాజేష్, పెట్ల గంగాధర్, సుర్ల రఘులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

చీటీల పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

మునగపాక (తుమ్మపాల), మే 16: చీటీల పేరుతో లక్షలాది రూపాయలు కాజేసి ముఖం చాటేసిన వాడ్రాపల్లి గ్రామానికి చెందిన కొయిలాడ వెంకట సత్యనారాయణను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. వాడ్రాపల్లి గ్రామానికి చెందిన కొయిలాడ వెంకట సత్యనారాయణ పలువురు దగ్గర నుంచి చీటీల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేశారన్నారు. తిరిగి చెల్లించాల్సిన సమయంలో ముఖం చాటేయడంతో మునగపాకకు చెందిన దాడి భాస్కరరావుతో పాటు పలువురు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో వస్తువులు దగ్ధం

కొత్తూరు, మే 16: అనకాపల్లి మండలంలోని వూడేరులో ఒక ఇంట్లో కరెంటు మీటర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా వస్తువులు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సిరసపల్లి సత్యారావు గురువారం ఉదయం పని నిమిత్తం చీడికాడ వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు ఇంట్లో మంటలు వస్తున్నాయని చుట్టుపక్కల వారు సత్యారావుకు సమాచారం ఇచ్చారు. అలాగే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్రిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే సత్యారావు కూడా ఇంటికి చేరుకున్నారు. ఈ మంటల్లో ఇంట్లో ఉన్న సోఫా, దివాణాకాట్, ఫ్రిజ్, టీవీ అగ్నికి దగ్ధమయ్యాయని, వీటి విలువ రూ.20 వేలు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

పాడేరు ఘాట్‌లో ప్రమాదం

» భర్త మృతి - భార్యకు తీవ్ర గాయాలు

» ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొనడంతో ఘటన

» మృతుడు అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేటవాసి



మృతి చెందిన పరసయ్య

పాడేరు రూరల్, మే 16 : పాడేరు ఘాట్ మార్గంలోని కోమాలమ్మ పనుకు సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానిక ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేటకు చెందిన గాడి పరసయ్య (43) తన భార్య రమణమ్మతో కలిసి పాడేరు మోదకొండమ్మను దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళుతున్న బొలేరో వాహనం కోమాలమ్మ పనుకు సమీపంలో వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో పరసయ్య అక్కడికక్కడే మృతిచెందగా, అతని భార్య రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ఆమెను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు అందిస్తున్నారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందిస్తామని ఎస్‌ఐ చెప్పారు. ఈ ఘటనలో రెండు గంటల పాటు ఇరువైపులా కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఓ మృతి

అనకాపల్లి టౌన్, మే 16 : విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మాకవరం వీఆర్‌ఓ బోని కృష్ణారావు (62) బుధవారం రాత్రి పదకొండున్నర గంటలకు మృతి చెందినట్టు హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. త్వరలో రిటైర్‌మెంట్ కానున్న కృష్ణారావు విధి నిర్వహణలో భాగంగా ఏప్రిల్ 28వ తేదీన మోర్చ రోగంతో ఒక్కసారిగా పడిపోయాడు. స్థానికులు సహకారంతో ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందినట్టు మృతుని అన్న పైడయ్య ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈయన స్వగ్రామం భీమిలి మండలం తాళ్లవలస అని ఆయన తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డు

» రోజుకు 80 టన్నుల చెత్త డంపింగ్

» దుర్వాసనతో జన్నం ఇక్కట్లు

» దోమలు స్వైరవిహారంతో కునుకు తీయని స్థానికులు

» వర్షం పడితే నరకయాతనే..

» డంపింగ్ యార్డు ఏర్పాటులో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం

» అవస్థలు పడుతున్న నివాసితులు, జీవీఎంసీ ఉద్యోగులు

జీవీఎంసీ కార్యాలయంలోనే ఏర్పాటు



జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో పేరుకుపోయిన చెత్త

అనకాపల్లి టౌన్, మే 16 :

పట్టణాలకు, గ్రామాలకు ఎక్కడైనా చెత్త డంపింగ్ యార్డును దూరంగా ఉంటాయి.. దీనివల్ల అటు పట్టణవాసులకు, ఇటు పల్లెవాసులకు ఎటువంటి దుర్వాసన, ఇబ్బందులు ఉండవు.. అయితే ఇందుకు భిన్నంగా పట్టణ నడిబొడ్డున కొన్నేళ్లుగా డంపింగ్ యార్డు ఉండడం పట్టణ వాసుల దురదృష్టంగా చెప్పవచ్చు. అది కూడా జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలోనే చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం విశేషం.



కార్యాలయ ఆవరణలోని చెత్తను ఎక్స్‌కవేటర్‌తో లారీలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి పట్టణంలో జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు నిత్యం సేకరించిన చెత్తను కొన్నేళ్ల క్రితం వరకు పట్టణానికి ఆనుకుని ఉన్న శారదానగర్ చివరన డంపింగ్‌యార్డులో వేసేవారు. ఆ ప్రాంతంలో నివాస గృహాలు పెరగడంతో స్థానికుల డిమాండ్ మేరకు చెత్తను అక్కడకు తరలించడం అధికారులు మానేశారు. డంపింగ్ యార్డు కోసం వేటజంగాలపాలెం, శంకరం తదితర ప్రాంతాల్లో అధికారులు స్థలాలను పరిశీలించినా ఆయా ప్రాంతాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మరో దారి లేక ఉదయం పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను జీవీఎంసీ జోనల్ కార్యాలయంలోని ఒక పక్కన నిల్వ చేస్తున్నారు. పట్టణంలో రోజుకి సుమారు 80 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. దీనిలో 70 టన్నుల వరకు చెత్తను కాపులుప్పడ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. రోజు మూడు వాహనాల్లో రెండు విడతల చొప్పున చెత్తను తరలిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే పోగేసిన చెత్తను ప్రత్యేక వాహనాలతో విశాఖలోని కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. అనకాపల్లి నుంచి చెత్తను అక్కడకు తరలించడం వల్ల వాహనాలకు డీజిల్ ఆయిల్ ఖర్చులు నెలకు ఐదు లక్షల రూపాయల వరకు జీవీఎంసీకి భారంగా మారింది. ఇదిలా ఉండగా ఈ డంపింగ్‌యార్డు వల్ల జీవీఎంసీ కార్యాలయానికి ఆనుకుని ఉన్న నివాస గృహాలతో పాటు పక్కనే ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క దుర్వాసన, మరోపక్క దోమల బెడదతో రేయింబవళ్లు అవస్థలు పడుతున్నారు. డంపింగ్‌యార్డును తరలించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి. వీరుయాదవ్ స్థానికులతో కలిసి కార్యాలయానికి వచ్చే ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా డంపింగ్‌యార్డు తరలింపునకు మోక్షం లభించలేదు. ఇటీవల ఈ డంపింగ్‌యార్డును జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.నాగబాబు కూడా సందర్శించి ముక్కున వేలేసుకున్నారు. డంపింగ్ యార్డును తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. వర్షాలు కురిసే సమయాల్లో అయితే చెత్త చాలా వరకు తడిసి మద్దవ్వడం వల్ల దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా తయారవ్వడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. సాక్ష్యాత్తూ జీవీఎంసీ జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బందే దోమల కాటు నుంచి తప్పించుకోవడానికి ఎలక్ట్రికల్ బ్యాట్‌లు వినియోగిస్తున్నారంటే ఈ డంపింగ్‌యార్డు ప్రభావం పట్టణ వాసులపై ఎంత ఉందో స్పష్టమవుతోంది. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గాని, ప్రజాప్రతినిధులు గాని డంపింగ్‌యార్డును వేరొక చోటకు మార్పు చేయాలనే ఆలోచన చేయకపోవడం పట్ల పట్టణ వాసుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేద్దామని ప్రయత్నించినా ఆయా ప్రాంతాల వాసుల నుంచి వ్యతిరేకత కనిపిస్తుందని, అందువల్లే చెత్తను ఉదయం సేకరించి కార్యాలయ ఆవరణలో వేసి ప్రత్యేక వాహనాలపై కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నామని జోనల్ కార్యాలయ అధికార వర్గాలు చెబుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి డంపింగ్‌యార్డు నుంచి తమకు మోక్షం కల్పించాలని సమీప నివాసితులు కోరుతున్నారు.

మారని శారదానగర్ ఓటరు తీరు!

» నియోజకవర్గంలోని అన్ని కేంద్రాల్లో 80 నుంచి 95 శాతం పోలింగ్

» ఇక్కడి 141, 142, 144 పోలింగ్ కేంద్రాలలో 59 శాతం కంటే తక్కువ ఓటింగ్

» మొత్తం ఓటర్లు 5068 మందికి 2,966 మంది ఓటు హక్కు వినియోగం



నర్సీపట్నంలోని శారదానగర్ దృశ్యం

నర్సీపట్నం, మే 16 : సార్వత్రిక ఎన్నికల్లో శారదానగర్ ఓటర్లలో పెద్దగా చైతన్యం కనిపించ లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తి ఓటు హక్కును వినియోగించుకుంటే.. విద్యావంతులు, ఉద్యోగులు నివసించే శారదానగర్‌లో పోలింగ్ తక్కువగా జరిగింది. అయితే గతంతో పోల్చిచూస్తే ఇప్పుడు పోలింగ్ శాతం కాస్త మెరుగుపడింది. 2014, 2019 ఎన్నికల కంటే నాలుగు శాతం పోలింగ్ పెరిగింది. ఇక్కడి 141, 142, 143, 144, 145 కేంద్రాల పరిధిలో కేవలం 59 శాతం ప్రజలు ఓట్లు వేశారు. నియోజకవర్గంలోని మిగిలిన పోలింగ్ కేంద్రాలలో 80 నుంచి 95 శాతానికి పైగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యల్పంగా శారదానగర్‌లోని 143 పోలింగ్ కేంద్రంలో 49.94 శాతం పోలింగ్ జరిగింది. ఈ కేంద్రంలో 861 మంది ఓటర్లు ఉంటే, కేవలం 430 మంది మాత్రమే ఓట్లు వేశారు. ఈ ఐదు పోలింగ్ కేంద్రాల పరిధిలో 5,068 ఓటర్లు ఉంటే, 2960 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఇక్కడ పోలింగ్ పెంచడానికి విశేష కృషి చేశారు. ప్రజలలో చైతన్యం తీసుకు రావడానికి విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దాని ఫలితంగానే గత ఎన్నికల కంటే నాలుగు శాతం పోలింగ్ పెరిగింది.

మునిసిపాలిటీలోని శారదానగర్, బ్యాంక్ కాలనీ, శాంతినగర్ ఓటర్లు గతంలో శారదా స్కూల్లో ఓట్లు వేసేశారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికలు శారదా స్కూల్ భవనం పడగొట్టడంతో 141 నుంచి 145 పోలింగ్ కేంద్రాలను డాన్‌బాస్కో స్కూల్‌లోకి తరలించారు. నియోజకవర్గంలోని మిగిలిన పోలింగ్ కేంద్రాలలో కంటే ఈ ప్రాంతంలో ఉద్యోగులు, విద్యావంతులు అధికంగా ఉండే శారదానగర్ పోలింగ్ కేంద్రంలో తక్కువ పోలింగ్ జరగడం పరిపాటిగా మారిపోయింది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఇక్కడ 55 శాతం కంటే తక్కువ పోలింగ్ జరుగుతుది.

స్థానికేతరులు కారణంగానే....

ఇతర ప్రాంతాల నుంచి వచ్చి శారదానగర్, బ్యాంక్ కాలనీ, శాంతినగర్‌లలో అద్దెకు, ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నవారు అధికంగా ఉన్నారు. ఏజెన్సీ, ఇతర ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు శారదాగనర్, బ్యాంక్ కాలనీలలో ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారు. ఇక్కడా.. అక్కడా ఓట్లు నమోదు చేసుకొని, ఎన్నికల సమయంలో సొంత ఊర్లకు వెళ్లి పోయి ఓట్లు వేస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో మిగిలిన పోలింగ్ కేంద్రాలలో 85 నుంచి 90 శాతం పైగా పోలింగ్ జరుగుతుంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా శారదానగర్‌లో పోలింగ్ పడిపోవడానికి కారణంగా ఇదే అంటున్నారు అధికారులు. 2014 అసెంబ్లీ ఎన్నికలలో శారదానగర్ శారదా స్కూల్‌లోని ఐదు పోలింగ్ కేంద్రాలలో 4,954 ఓట్లకు 2,681 (54.11 శాతం) పోలయ్యాయి. 2019 ఎన్నికలలో 5006 ఓట్లుకు 2,668 (53.29 శాతం) పోలయ్యాయి. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో 5,068 ఓట్లు ఉంటే 2,966 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 141 పోలింగ్ కేంద్రంలో 1214 మంది ఓటర్లకు 702 మంది (57.83 శాతం), 142 పోలింగ్ కేంద్రంలో 1,192 ఓటర్లకు 673 మంది (56.46 శాతం) ఓట్లు వేశారు. 143 పోలింగ్ కేంద్రంలో 861 ఉంటే కేవలం 430 మంది (49.94 శాతం), 144 పోలింగ్ కేంద్రంలో 849మందికి కేవలం 482 (56.77 శాతం), 145 పోలింగ్ కేంద్రంలో 952కి 679 (71.32) శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి పడి హెల్పర్ మృతి

» న్యాయం చేయాలని బంధువులు, 4 గ్రామాల ప్రజలు నిరసన

» మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన గండి బాబ్జీ





మెట్ కోక్ ఇండస్ట్రీ, ఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన వెంకటరమణ

సబ్బవరం, మే 16 : మండలంలోని గాలిభీమవరం రెవెన్యూ పరిధిలో గల బొగ్గు కంపెనీలో విద్యుత్తు మరమ్మతులు చేపట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కిన ఏపీఈపీడీసీఎల్ హెల్పర్ విద్యుదాఘాతంతో కింద పడి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని ఆరిపాక గ్రామానికి చెందిన గొంప వెంకటరమణ (45) ఏపీఈపీడీసీఎల్‌లో హెల్పర్‌గా 35 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. గాలిభీమవరం రెవెన్యూ పరిధిలో గల కోరమండల్ మెట్‌కోక్ ఇండస్ట్రీలో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడడంతో స్థానిక లైన్‌మన్ పినిశెట్టి రామకృష్ణకు సమాచారం ఇచ్చారు. అతను గొంప వెంకటరమణను తీసుకొని వెళ్లాడు. వెంకటరమణ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఆరిపాక, గాలిభీమవరం, లగిశెట్టిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు, కుటుంబ సభ్యులు భార్య వెంకటలక్ష్మి, కుమార్తె భాగ్యశ్రీ, కుమారుడు ప్రదీప్ కంపెనీ వద్దకు చేరుకొని రోదించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అయితే కంపెనీ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బంధువులు, గ్రామస్థులు మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి సమాచారం ఇచ్చారు. అతను హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

మానవతా దృక్పథంతో న్యాయం చేయండి : గండి బాబ్జీ

మెట్‌కోక్ కంపెనీ ప్రతినిధులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులు మృతుని కుటుంబానికి మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కోరారు. నిరుపేద కుటుంబం, ఎటువంటి ఆధారం లేనందున ఏపీఈపీడీసీఎల్ సంస్థలో మృతుడి కుమారుడికి ఉద్యోగం, రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెట్‌కోక్ ఇండస్ట్రీ ప్రతినిధులు రూ.25 లక్షలు మృతుడి కుంటుంబానికి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకుంటే మృతదేహంతో కంపెనీ ఎదుట నిరసన కొనసాగిస్తామని గండి బాబ్జీ హెచ్చరించారు. కాగా, కంపెనీ ప్రతినిధులు రూ.15 లక్షలు చెల్లించేందుకు లిఖితపూర్వక హామీ ఇచ్చారు. అదేవిధంగా ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. గ్రామ పెద్దలు గొర్లి రాజేశ్, పాలిశెట్టి సురేశ్, ఎస్.నారాయణమూర్తి, రమేశ్‌రాజ్, శరగడం రాము పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు : పది మందికి గాయాలు

ఏలూరు క్రైం, మే 16: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఏలూరు సమీపంలో టైర్ పంక్చర్ అయి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో తొమ్మిది మంది తీవ్ర గాయాల పాలయ్యారు. అనకాపల్లి జిల్లా రావికతమం మండలం దొండపూడి గ్రామానికి చెందిన గంజి చిరంజీవి, అతని భార్య వెంటకలక్ష్మి, వారి కుమార్తె భాగ్యలక్ష్మి, బంధువులు కొప్పాక ఆదిలక్ష్మి, చలపారెడ్డి వరలక్ష్మి, చెలపారెడ్డి రూప, నర్సీపట్నానికి చెందిన చలపారెడ్డి శ్రీను, చలపారెడ్డి రావునాయుడు, శ్రీను కుమారుడు(4), చలపారెడ్డి గోపీలు కలిసి విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి దైవదర్శనానికి వెళ్లారు. గురువారం దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా అకస్మాత్తుగా కారు టైరు పేలడంతో అదుపుతప్పి సర్వీసు రోడ్డులోకి వెళ్లి అక్కడ డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టికొంది. ఈ ప్రమాదంలో వీరంతా తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మెరుగైన చికిత్స కోసం విశాఖపట్టణం, నర్సీపట్నానికి బంధువులు తీసుకు వెళ్లారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెందుర్తిలో ‘బకెట్’ కలకలం

» కొందరు గాజుగ్లాస్‌కు వేయబోయి బకెట్‌కు వేశారని ప్రచారం

పరవాడ, మే 16 : పెందుర్తి నియోజకవర్గంలో బకెట్ గుర్తు కలకలం రేపుతోంది. అటు రాజకీయ వర్గాల్లోను, ఇటు సామాన్యుల చర్చల్లో ప్రధాన అంశమైంది. పెందుర్తిలో భారత్ నవరంగ్ పార్టీ తరుపున పోటీలో దిగిన పెచ్చెట్టి రమేష్‌నాయుడుకు ఎన్నికల సంఘం బకెట్ గుర్తు కేటాయించింది. ఇక్కడ 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈవీఎంపై అభ్యర్థుల గుర్తులను వరుసుగా కేటాయించే క్రమంలో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు గాజుగ్లాసు గుర్తు కింద బకెట్ గుర్తు ఉండడంతో పలువురు వృద్ధులు కనిపించక గాజుగ్లాసుకు వేయాల్సిన ఓటు బకెట్‌కు వేసినట్టు చర్చ జరుగుతోంది. ఈవీఎంపై ఉన్న గుర్తుల్లో బకెట్ గుర్తుపై సిరా మచ్చలు కనిపించడం రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమైంది. పదుల సంఖ్యలో ఓట్లు బకెట్ గుర్తుకు వేసినట్టు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా జనసేన, వైసీపీ మధ్యే హోరాహోరీ పోటీ ఉంది. ఎంతమేర ఓట్లు బకెట్‌కు వేశారన్నది వచ్చే నెల నాల్గో తేదీన తేలనుంది. అప్పటి వరకు బకెట్ గుర్తుపై గ్రామాల్లో చర్చ జరుగుతూనే ఉంటుంది.

దుర్మార్గులపై ఉక్కుపాదం మోపేలా చట్టాలు ఉండాలి

» జై భారత్ నేషనల్ పార్టీ అధినేత లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

అనకాపల్లిటౌన్, మే 16: చట్టాలు ప్రజలకు మేలు చేసేలా.. దుర్మార్గులపై ఉక్కుపాదం మోపేలా ఉండాలని జై భారత్ నేషనల్ పార్టీ అధినేత లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఏపీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలైతే సామాన్యులపై దుష్ప్రభావం చూపుతాదన్నారు. జ్యుడీషియరీ లేకుండా అధికారమంతా ఎగ్జిక్యూటివ్ చేతుల్లో పెడితే రాజకీయ నాయకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉంటుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంలో మార్పులు చేయాల్సి ఉందన్నారు. దీనికి మేధావులైన న్యాయవాదులు పూనుకోవాలని సూచించారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అనకాపల్లి బార్ ఆధ్వర్యంలో వంద రోజులు నిరసన చేపట్టడాన్ని అభినందించారు. అనంతరం ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అభినందించి, వారిని సత్కరించారు. సీనియర్ న్యాయవాదులు రామచంద్రరావు, రమణయ్య, శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు జేడీని సత్కరించారు.

హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేయడం తగదు

» ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఎస్. రాయవరం, మే 16: నాడు-నేడు పనులకు సంబంధించి డీఈవో షోకాజ్ నోటీసులను జారీ చేయడం హెచ్‌ఎంలను కించపరచడమేనని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేకేఎల్ఎన్ ధర్మారావు, దుర్గాప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు పంపించడం చాలా దురదృష్టకరమన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి క్షేత్రస్థాయిలోని పరిస్థితిని వివరిస్తామన్నారు. నిధులు, సిమెంట్ వంటివి లేకుండా పనులు చేయమనడం అర్థరహితమన్నారు. హెచ్‌ఎంలు చేయని తప్పులను వారిపై ఎత్తి చూపి అన్యాయంగా వారిపై చర్య చేపట్టాలనుకోవడం తగదన్నారు. ఏ తప్పు చేయని హెచ్‌ఎంలను బాధ్యులుగా చేయవద్దని ధర్మారావు, దుర్గాప్రసాద్ కోరారు.

వరల్డ్ బీచ్ పారా వాలీబాల్ పోటీలకు పాత సోముదేవుపల్లి దివ్యాంగుడు గణేశ్ ఎంపిక

» 28 నుంచి చైనాలో పోటీలు



ఎస్.రాయవరం, మే 16: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పాత సోముదేవుపల్లి గ్రామానికి చెందిన అన్నం గణేశ్ దివ్యాంగుల కోటాలో బీచ్ పారా వాలీబాల్ జట్టులో ఎంపికయ్యాడు. ఈనెల 28 నుంచి జూన్ నెల 4వ తేదీ వరకు చైనాలో జరిగే వరల్డ్ చాంపియన్ షిప్‌లో ఆడనున్నాడు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ వరల్డ్ చాంపియన్ షిప్ జట్టు ఈనెల 4వ తేదీన తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో 12 మంది జట్టులో తాను కూడా ఎంపికయినట్టు గణేశ్ తెలిపారు.

వచ్చే నెల 30 నుంచి ఏపీఎల్ సీజన్-3

» బరిలో ఆరు జట్లు...మొత్తం 19 మ్యాచ్‌లు

» వేదికలుగా విశాఖ, కడపలోని స్టేడియాలు

» వివరాలు వెల్లడించిన ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 16: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 ఛాంపియన్‌షిప్ టోర్నీ వచ్చే నెల 30 నుంచి జరగనుందని ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీకి విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం, కడపలోని క్రికెట్ స్టేడియాలను వేదికలుగా ఎంపిక చేశామన్నారు. టోర్నీలో బెజవాడ టైగర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్ వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ వంటి ఆరు ఫ్రాంచైజర్ జట్ల మధ్య మొత్తంగా 19 మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో 12 మ్యాచ్‌లు, కడపలో ఏడు మ్యాచ్‌లు ఆడే విధంగా షెడ్యూల్ రూపొందించామన్నారు. జట్ల ఎంపికకు సంబంధించి నిర్వహిస్తున్న వేలంలో 452 మంది ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారని, వారిని నాలుగు కేటగిరీలుగా విభజించామన్నారు. ఏసీఏ పరిధిలోని ఆటగాళ్ల గణాంకాలను ఎప్పటికప్పుడు పొందుపరిచేందుకు స్పోర్ట్సు మెకానిక్ అనే కొత్త సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్సు ఛానెల్‌లో తెలుగులో కూడా ప్రత్యక్ష ప్రసారం అయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఏపీఎల్ సీజన్-1, సీజన్-2 ద్వారా అనేక మంది ప్రతిభ గల యువ క్రికెటర్లు వెలుగులోకి వచ్చి ఐపీఎల్, భారత్-ఏ జట్లలో స్థానం పొందారని, సీజన్-3 ద్వారా మరికొంత మంది ఆటగాళ్లకు ఉన్నత స్థాయి టోర్నీలలో అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏసీఏ, ఏపీఎల్ ప్రతినిధులు చలం, నవనీత్‌కృష్ణ, జితేంద్రనాథ్, ఎంఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మాణం

డీటీకి ఫిర్యాదు చేసిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు

రాంబిల్లి, మే 16 : మండలంలోని పెదకలవలాపల్లి గ్రామ రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో డీఆర్‌డీవో అధికారులు చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని నిలిపివేయించాలంటూ ఎంపీటీసీ మాజీ సభ్యులు రావి దేముళ్లు గురువారం డిప్యూటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఈ సర్వే నంబరులో కొంతమంది పేదలకు పట్టాలు ఇచ్చారని, మిగతా భూమి జగనన్న నిర్మాణాలకు ఇచ్చారన్నారు. ఇందులో మిగిలిన 60 సెంట్లులో ప్రహరీ నిర్మిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని ఆయన కోరారు.

గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్య సేవలందించాలి

రాంబిల్లి, మే 16 : ఎస్‌ఈజడ్ పరిధిలోని సింబయో జనరిక్స్ ఫార్మా కంపెనీలో ప్రమాదానికి గురై అచ్యుతాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బెంగాల్‌కు చెందిన కార్మికుడు కాజల్ బౌరీ(40) మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న కార్మికుడుని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయన కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని రాము డిమాండ్ చేశారు.

లైన్‌మన్ కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

» సీఐటీయూ నాయకులు డిమాండ్

కొత్తూరు, మే 16 : ఇటీవల మృతి చెందిన ఆరిపాక ఫీడర్ లైన్‌మన్ గొంపా రమణ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రమణ గత 13 ఏళ్లుగా అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడని, విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడన్నారు. మృతుడు కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

సీపీఐ. ఏఐటీయూసీ నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ్

కొత్తూరు, మే 16 : అనంతపురం జిల్లాలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. బుధవారం తాడిపత్రిలో డీఎస్పీ దీఎస్‌కే. చైతన్య ప్రత్యేక పోలీసు బలగాలతో టీడీపీ నేత జేసీ ప్రభాకరరెడ్డితో సహా పలువురు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఇళ్లపై దాడి చేసి ఇష్టానుసారంగా కొట్టారన్నారు. ఈ ఘటనలో దివ్యాంగుడైన కిరణ్ తలపై డీఎస్పీ చైతన్య లాఠీతో బలంగా కొట్టడంతో తీవ్ర గాయమై కిరణ్ పరిస్థితి విషమంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుడైన కిరణ్‌ను పరామర్శించేందుకు గురువారం వెళ్లిన సీపీఐ, ఏఐటీయూసీ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే వారందరినీ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

రావికమతం, మే 16 : పంటల సాగులో రైతులు ఆధు నిక పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధిం చవచ్చునని సైకాస్ వ్యవసాయ కళాశాల ఏడీ డా. మోషే అన్నారు. గురువారం మత్స వానిపాలెం గ్రామంలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నైరా, సైకాస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వ్యవసాయం, పని అనుభవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ గ్రామీణ రైతులు పంటల సాగులో ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకోవడానికి ఇదో మంచి అవకాశమన్నారు. పంటల సాగులో అధికంగా రసాయనాలు వినియోగించడం వల్ల కలిగే అనార్థాలను రైతులకు వివరించారు.

మోదకొండమ్మ ఉత్సవ సందడి మొదలు

» పాడేరులో 19, 20, 21 తేదీల్లో ఉత్సవాలు



పాడేరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాల సందడి మొదలైంది. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఉత్సవాలను నిర్వహించనున్నారు. అధికార యంత్రాంగం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి అరకులోయ, విశాఖపట్నం, చింతపల్లి వెళ్లే మార్గాల్లో విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డుపై భారీ విద్యుత్ సెటింగ్‌ల కోసం కటౌట్లు పెట్టారు. ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ ఎం.విజయసునీత ఆధ్వర్యంలో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు.

వర్షంతో జిల్లా వాసులు ఊరట

అనకాపల్లిటౌన్, మే 16 : పట్టణంలో గురువారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు చిరుజల్లులు కురవడంతో ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా ఉదయాన్నే ఇంటి అవసరాలకు బయటకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లిలో 10.5 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షపు చినుకులు పడి ఆగిన కొద్దిసేపటికే రహదారులన్నీ పొడిగా మారాయి. మధ్యాహ్నం రెండు గంటలు తర్వాత ఎండ కాయడంతో జనాలు రోడ్ల పైకి వచ్చి తమ పనులను చూసుకున్నారు.

పరవాడలో.. మండల కేంద్రం, పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. సుమారు గంటన్నరపాటు కురిసిన వర్షానికి ప్రజలు సేదతీరారు. ఇటీవల కాసిన ఎండలతో అల్లాడిపోయిన ప్రజానీకానికి ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. ఈ వర్షం కూరగాయల పంటలకు ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ ప్రాంతాల్లో కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది.

పాయకరావుపేటలో.. పాయకరావుపేటలో గత 24 గంటలుగా అడపాదడపా వర్షం పడుతుండడంతో వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా రోజూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వడగాడ్పులు, ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ వర్షంతో వారు ఉపశమనం పొందారు. బుధవారం రాత్రి నుంచి తెల్లవార్లు అడపాదడపా వర్షం పడింది. గురువారం ఉదయం కూడా ఆకాశం మేఘాలతో నిండి భారీ వర్షం పడడంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం రాత్రి నుంచి అడపాదడపా పడుతున్న వర్షానికి వాతావరణం వాతావరణం పూర్తిగా చల్లబడింది.

రాంబిల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. పలు గ్రామాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచింది. ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉండడంతో ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వ్యవసాయ పనులు చేసుకొనేంత వర్షం పడలేదని రైతులు అంటున్నారు.



పాయకరావుపేటలో గురువారం తెల్లవారుజామున పడుతున్న వర్షం

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. కొన్ని రోజులుగా ఎండలకు పెరిగిన ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడిన ప్రజలు గురువారం కురిసిన వర్షానికి సేద తీరారు. చాలా కాలంగా వర్షాలు కురవకపోవడంతో పచ్చిక లేక పశువులు మేతకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో పశువులకు మేత దొరుకుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం

» రోడ్డు పక్కనే చెత్త డంపింగ్

ఎలమంచిలి, మే 16 : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్య సమస్య తీవ్రతరంగా మారుతోంది. గ్రామాల్లోని ప్రధాన రోడ్ల పక్కనే రోజుల తరబడి చెత్త పేరుకుపోతున్నా.. పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. పీఎస్ఆర్ గ్రామంలో రోజుల తరబడి ప్రధాన రోడ్డు పక్కనే చెత్తను డంపింగ్ చేస్తుండడంతో రోడ్డు మార్గాన రాకపోకలు సాగించే వారంతా తీవ్ర దుర్వాసనకు ఇబ్బంది పడుతున్నారు. మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో ప్రధాన రోడ్డు చెంతనే చెత్త పేరుకుపోతున్నా పట్టించుకోకపోవడంతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. పేరుకుపోతున్న చెత్తకు తోడు ఇటీవల వర్షం కురవడంతో పారిశుద్య సమస్య మరింత జఠిలంగా మారుతున్నది. పులపర్తి గ్రామంలో నీటిపారుదల కాలువను చెత్తతో కప్పేస్తున్నా సరే అటు పంచాయతీ అధికారులు, ఇటు నీటిపారుదల శాఖ పట్టనట్టు వ్యవహరిస్తు న్నారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న రోజుల్లోనైనా అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎలమంచిలి: ఏటికొప్పాక ప్రధాన రోడ్డు పక్కన తొలగించని చెత్త



పాయకరావుపేట రూరల్: పెదరాంభద్రపురంలో రోడ్డుపై వేసిన చెత్తా, చెదారం

చౌడువాడలో అస్తవ్యస్తంగా డ్రైనేజి వ్యవస్థ

కోటవురట్ల, మే 16: మండలంలోని చౌడువాడలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉండడంతో దోమలు ఉత్పత్తి కేంద్రంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ రోగాలు ప్రబలుతాయోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వాడుక నీరు కాలువల్లో పారడం లేదని, వీధుల్లో నివాసాలకు మధ్యలో ఎక్కడిక్కడ నిల్వగా ఉంటున్నాయని గ్రామస్థులు తెలిపారు. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో కాలువలను పూర్తిస్థాయిలో నిర్మించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.



కోటవురట్ల: రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

రోడ్డుపైనే చెత్తా, చెదారం

పాయకరావుపేట రూరల్, మే 16: మండలంలోని పెదరాంభద్రపురం ప్రధాన రహదారిపై చెత్తా, చెదారం వేస్తుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డుపై వేసిన చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధం వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించినా చెత్తను మాత్రం తరలించడం లేదని వారంటున్నారు.

ఓటరు తీర్పు ఎటు?

» ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ... » విజయంపై ఇరు పార్టీలు ధీమా

» మునిసిపాలిటీలో పందేలకు సై అంటున్న పందెంరాయుళ్లు

ఎలమంచిలి, మే 16: ఎలమంచిలి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గతంలో కంటే అధికంగా 85.94 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయానికి ముందుగానే ఓటర్లు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేచి ఉండడం ఈ దఫా ఎన్నికల్లో విశేషం. పోలింగ్ శాతం అధికంగా నమోదు కావడంతో ఈసారి ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందోననే చర్చ కొనసాగుతోంది. ఏ నలుగురు కలిసినా.. విజయావకాశాలు గురించే చర్చించుకుంటున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు, కార్యకర్తల్లో విజయంపై ధీమా వ్యక్తమవుతోంది. అదే రీతిలో వైసీపీ నేతల్లోనూ విజయావకాశాలు తమకే అన్నట్టు ధీమాగా ఉన్నారు. గత ఎన్నికల్లో త్రిముఖ పోటీ కారణంగా ఓటు బ్యాంకు చీలిపోవడానికి వీలు ఏర్పడి ప్రత్యర్థి విజయానికి వీలు ఏర్పడిందని, ఈసారి ఎన్నికలు అలా కాదని కూటమి నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలంతా ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయం వైపు అడుగులు వేశామని అంటున్నారు. తమకు ప్రజల మద్దతు ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమ విజయానికి కారణమవుతాయని వైసీపీ నేతలు అంటున్నారు. ఎన్నికలపై పలు చోట్ల పందెంరాయుళ్లు పందేలు వేసేందుకు సై అంటున్నారు.



యర్రవరంలో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద వేచి ఉన్న ఓటర్లు(ఫైల్‌ఫొటో)

డెంగ్యూపై అవగాహన ర్యాలీలు

కశింకోట, మే 16 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డెంగ్యూపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు డెంగ్యూ జ్వరం రావడానికి గల కారణాలను, వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇవోలు, పీహెచ్ఎన్, సూపర్‌వైజర్లు, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. అనకాపల్లి మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీలో గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీని చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి వాణిజగదీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డెంగ్యూ నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ డి. శారదా, ఎంపీహెచ్ఎస్ బి.సంగం, హెచ్‌వీ బి.మరియమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బాలశ్రావణి అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం దిమిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి బాలశ్రావణి మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కళ్లు కదిలించలేని పరిస్థితి, వెన్నునొప్పి, శరీరంపై దద్దురులు, వాంతులు, వికారం, రక్తంతో కూడిన విరోచనాలు ఉంటే డెంగ్యూ వ్యాధిగా భావించి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందిఎస్ఎస్‌వీఎస్ రాజు, సీహెచ్ ధనరాజు పాల్గొన్నారు.



కశింకోటలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం



తుమ్మపాలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

'న్యాయం చేసే వరకూ పోరాటం'

రోలుగుంట, మే 16 : మండలంలోని జేపీ అగ్రహారంలో ప్రభుత్వ భూముల సరిహద్దులను నిర్ధయించడానికి గురువారం గ్రామా నికి వచ్చిన రెవెన్యూ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి సాగు అనుభవంలో ఉన్న జిరాయితీ భూములపై మూడు గ్రామాలకు చెందిన 400 మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వీటిపై కొంతమంది దళారులు కన్ను పడడంతో ఇనామ్ భూమిగా రికార్డులు సృష్టించి, అడ్డదారుల్లో పాసు పుస్తకాలు పొందారని చెప్పారు. 2021 ఆగస్టు 14, 15 తేదీల్లో సెలవు అయినప్పటికీ నాటి తహసీల్దార్ బదిలీ అయి రిలీవింగ్ అయినప్పటికీ దళారులకు రాత్రికి రాత్రే ఆఘమేఘాల మీద మ్యూ టేషన్లు చేసి పాసు పుస్తకాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయమై రెండుసార్లు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అధికారులే తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యాశాఖలో షోకాజ్ నోటీసుల కలకలం

... 5వ పేజీ తరువాయి

విద్యాశాఖ తరఫున నిర్మాణ పనుల్లో జాప్యానికి కారణాలను తెలియజేయాలని కోరుతూ డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసుల జారీపై జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్‌లో వివరణ కోరగా షోకాజ్ నోటీసులు జారీ చేయడం వాస్తవమేనని, నోటీసులు అందుకున్న ప్రధానోపాధ్యాయులు రెండు రోజుల్లో వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిధుల విడుదల జాప్యంపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గెడ్డ వాగులనూ మింగేశారు!

... 5వ పేజీ తరువాయి

అనుకొని సర్వే నంబరు 103లో ప్రైవేటు భూమి ఉంది. ఆ ప్రైవేటు భూమిని లేఅవుట్‌గా చేసి, పక్కనే ఉన్న సర్వే నంబరు 77లోని గెడ్డ వాగు స్థలం ఆక్రమించి జిరాయితీతో కలిపి లేఅవుట్ వేసి అమ్మేసుకున్నారు. దీనిని మూడేళ్ల క్రితం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో జీవీఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పోలీసుల సహాయంతో ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణాలు కూల్చివేశారు. మళ్లీ ఇప్పుడు అక్కడ ప్రహరీ నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల్లోని కింది స్థాయి ఉద్యోగుల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైలు ప్రయాణికుల అవస్థలు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఇదీ కూడా రద్దు కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. కోనార్క్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటల సమయంలో ఉన్నప్పటికీ ఎప్పుడూ ఆలస్యంగా వస్తుంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. అనకాపల్లి మీదుగా విశాఖ నుంచి ఉదయం ఏడు గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వెళ్లిన తరువాత 7.55 గంటలకు విశాఖ - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. ఈ రైలులో పట్టణ వాసులతో పాటు అనకాపల్లి చుట్టు పక్కల నియోజకవర్గాల ప్రయాణికులు కూడా తుని, అన్నవరం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ ప్రాంతాలకు అధిక సంఖ్యలో వెళ్లేవారు. ఈ రైలు ప్రస్తుతం రద్దు కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. తరువాత తొమ్మిది గంటలకు బొకారో ఎక్స్‌ప్రెస్ ఉండగా మళ్లీ మధ్యాహ్నం పన్నెండున్నర వరకు రైళ్లు విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులకు అందుబాటులో ఉండడం లేదు. రైళ్లల్లో తక్కువ చార్జీలతో ప్రయాణం సుఖవంతంగా ఉంటుంది. అదే ఆర్టీసీ బస్సుల్లో రెట్టింపు చార్జీలకు పైగా ప్రయాణం ఖర్చులు అవుతుంటాయి. రైళ్లలో విశాఖపట్నం వెళ్లేందుకు కేవలం రూ.30లతో చేరుకోవచ్చు. అదే ఆర్టీసీ బస్సు అయితే రూ.60లు చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ చార్జీలు పెరగడం వల్ల ప్రయాణికులు రైళ్లల్లో ప్రయాణించడానికి మొగ్గుచూపుతున్నారు. అయితే గత కొంతకాలంగా ఈ రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు వివిధ పనులపై దూర ప్రాంతాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రహదారిపై మురుగునీరు తొలగింపు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రహదారిపై నిలిచిన మురుగునీరును తొలగిస్తున్న దృశ్యం

పరవాడ, మే 16: కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎదురుగా రహదారిపై నిలిచిపోయిన మురుగునీరును గురువారం పంచాయతీ అధికారులు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.శుభాష్ పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది మురుగునీటిని తొలగించేశారు. 'మూలస్వయంభూవరంలో రహదారిపై మురుగు తిష్ట' అన్న శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. పంచాయతీ విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు రహదారిపై ఉన్న మురుగునీటిని తొలగించేశారు. ఆ ప్రాంతమంతటా పరిశుభ్రంగా తయారు చేయించారు. మురుగునీరు పోయే విధంగా చిన్నపాటి కాలువను ఏర్పాటు చేశారు. వాడుకనీరు రహదారిపై నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని రమేష్‌నాయుడు వెల్లడించారు.

తుమ్మపాలలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



తుమ్మపాలలో పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

తుమ్మపాల, మే 16 : మేజరు పంచాయతీ తుమ్మపాలలో గురువారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేశారు. ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'తుమ్మపాలలో అపారిశుధ్యం' అనే కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశుధ్య సిబ్బందితో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు, మురుగు నిల్వలను తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల విధులకు పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని వినియోగించడంతో గ్రామంలో శతశాతం పారిశుధ్య పనులు చేపట్టలేకపోయామన్నారు. అలాగే సిబ్బంది కొరత కూడా పంచాయతీని వెంటాడుతుందన్నారు. భవిష్యత్తులో గ్రామస్థులకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి పుట్టుక మహోత్సవం

రాంబిల్లి, మే 16 : మండలంలోని మామిడివాడలో పైడిమాంబ అమ్మవారి పుట్టుక మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ దంపతులు, పలువురు నేతలతో కలిసి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.



అమ్మవారిని దర్శించుకున్న విజయకుమార్ దంపతులు

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి


» సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, మే 16 : పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. గురువారం దీపాంజలినగర్‌లో గల సవ్యాస్ భవనంలో ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. 15 రోజులు పాటు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు సీజీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీజీ విభాగం సీజీఎం రస్మిరంజన్‌పరిదా, సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు సురేష్‌జాన్ డేవిడ్, నోవాహగడ్డం, పద్మప్రియ, హెచ్ఆర్ హెడ్ బీబీ పాత్ర, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల్లో నూకాంబిక రాతి విగ్రహం లభ్యం



ఇసుక తవ్వకాల్లో బయటపడ్డ నూకాంబిక అమ్మవారి రాతి విగ్రహం

ఎస్.రాయవరం, మే 16: మండలంలోని పెదఉప్పలం వద్ద వరహానదిలో గురువారం చేపట్టిన ఇసుక తవ్వకాల్లో నూకాంబిక అమ్మవారి రాతి విగ్రహం బయటపడినట్టు స్థానికులు తెలిపారు. ఇసుక తవ్వుతుండగా ఒక్కసారిగా అమ్మవారి విగ్రహం బయట పడిందని తెలుసుకున్న స్థానికులు ఆ ప్రదేశానికి వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం తాత్కాలికంగా అమ్మవారికి పందిర వేశారు. శుక్రవారం సిద్ధాంతిని పిలిపించి బయటపడిన అమ్మవారి విగ్రహం గురించి తెలుసుకోనున్నట్టు పలువురు తెలిపారు.

రేపటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

మాడుగుల, మే 16 : మాడుగులలోని వెంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి శుక్రవారం వరకూ జరగను న్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నున్న శ్రీనివా సాచార్యులు, ఆరవెల్లి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నట్టు చెప్పారు.

ఘనంగా కామేశ్వరమ్మ పండగ

మాకవరపాలెం, మే 16 : రాచపల్లిలో కామేశ్వరమ్మ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద జరిగిన పూజల్లో జడ్పీటీసీ దంపతులు పెట్ల సత్యవేణి,పెట్ల భద్రాచలం, సర్పంచ్ దంపతులు రుత్తల సీతారాముడు, జోగిపాత్రుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

ఘనంగా కామేశ్వరమ్మ పండగ



మాకవరపాలెం, మే 16 : రాచపల్లిలో కామేశ్వరమ్మ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద జరిగిన పూజల్లో జడ్పీటీసీ దంపతులు పెట్ల సత్యవేణి,పెట్ల భద్రాచలం, సర్పంచ్ దంపతులు రుత్తల సీతారాముడు, జోగిపాత్రుడు, ఎంపీటీసీ ఆర్.పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం మండలంలో ముసురు

నాతవరం, మే 16 : వాతావరణంలో మార్పుల కారణంగా నాతవరం, పరిసర మండలాల్లో గురువారం ముసురు పట్టింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో ఇన్నాళ్లు భానుడి ఉగ్రరూపానికి అల్లాడిన జనం ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నువ్వు పంట వేసేందుకు అవసరమైన దుక్కి పనులకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ/ కృష్ణాదేవిపేట, మే 16 : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండలంలోని గొలుగొండ, చీడిగుమ్మల, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీల పరిధిలో గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, ధనుంజయ, గాయిత్రి, హరిప్రవీణ్‌లు మాట్లాడుతూ సీజన్ వ్యాధులకు గురికాకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డెంగ్యూ జ్వరం పగటిపూట దోమ కాటువల్ల వస్తుందన్నారు. ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ఫ్రిజ్ వెనుక, నీళ్ల కుండీలు తదితరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద చెరువుపై చిన్నచూపు

- రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తా చెదారం
- నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన ట్యాంక్ బండ్ పనులు
- బహిరంగ మల, మూత్ర విసర్జనతో దుర్వాసన
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మునిసిపాలిటీ



పెద్ద చెరువు వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం

నర్సీపట్నం, మే 16 : పట్టణ శివారు పెద్ద చెరువు రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. బహిరంగ మల, మూత్ర విసర్జనతో ఈ ప్రాంతం దారుణంగా తయారైంది. ఇక్కడి పారిశుధ్య పరిస్థితిని చూసి జనం మునిసిపాలిటీ అధికారులు, పాలకవర్గంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. నర్సీపట్నం పెద్దచెరువు ప్రాంతాన్ని ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో అయ్యన్నపాత్రుడు ఆర్‌అండ్‌బీ శాఖ స్టేట్ హైవే ప్లాన్ నుంచి రూ.5.7కోట్లు నిధులు మంజూరు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ నుంచి మరో రూ.95 లక్షలు నిధులు మంజూరు చేయించారు. 2018 డిసెంబరులో ట్యాంక్ బండ్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.2.4 కోట్లు ఖర్చు చేసి చెరువు గట్టుకు కాంక్రీట్ వాల్, పొలాల వైపు రాతి కట్టు, తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. 2019 ఎన్నికల తర్వాత ట్యాంక్ బండ్ పనులు నిలిచి పోయాయి.

ఇంకా చేయాల్సిన పనులు ఇవీ...

విద్యుత్ దీపాలు, చెరువు గట్టు మీద వాకింగ్ ట్రాక్, స్టీల్ రైలింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంజూరు చేసిన రూ.90లక్షల నిధులతో జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మునిసిపాలిటీ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.72 కోట్లతో పెద్ద చెరువు వద్ద పార్కును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ రెండేళ్ల క్రితం ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

క్షీణించిన పారిశుధ్యం

పెద్ద చెరువు రోడ్డుకు ఇరువైపులా బహిరంగ మల విసర్జనతో దుర్వాసన వెదజల్లుతుంది. చెత్తాచెదారం పేరుకుపోయింది. కోళ్లఫారాల వ్యర్థాలు, చనిపోయి జంతువులను పడేస్తున్నారు. దుర్గంధం భరించలేక అటువైపుగా రావాలంటే భయపడుతున్నారు. పెద్ద చెరువుని ఆనుకొని ఉన్న మరిడి మహాలక్ష్మి అమ్మవారు, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలకు వచ్చే భక్తులు దుర్వాసనను భరించ లేకపోతున్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే పెద్ద చెరువు వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేసి, శుభ్రం చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మోదకొండమ్మ ఉత్సవ సందడి మొదలు

- పాడేరులో 19, 20, 21 తేదీల్లో వేడుకలు



పాడేరు మోదకొండమ్మ



అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కటౌట్

పాడేరు, మే 16(ఆంధ్రజ్యోతి): పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాల సందడి మొదలైంది. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఉత్సవాలను నిర్వహించనున్నారు. అధికార యంత్రాంగం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అంబేద్కర్ సెంటర్ నుంచి అరకులోయ, విశాఖపట్నం, చింతపల్లి వెళ్లే మార్గాల్లో విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డుపై భారీ విద్యుత్ సెటింగ్‌ల కోసం కటౌట్లు పెట్టారు. ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ ఎం.విజయసునీత ఆధ్వర్యంలో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు.

విద్యాశాఖలో షోకాజ్ నోటీసుల కలకలం

... 5వ పేజీ తరువాయి

విద్యాశాఖ తరపున నిర్మాణ పనుల్లో జాప్యానికి కారణాలను తెలియజేయాలని కోరుతూ డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసుల జారీపై జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్‌లో వివరణ కోరగా షోకాజ్ నోటీసులు జారీ చేయడం వాస్తవమేనని, నోటీసులు అందుకున్న ప్రధానోపాధ్యాయులు రెండు రోజుల్లో వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిధుల విడుదల జాప్యంపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రైలు ప్రయాణికుల అవస్థలు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఇదీ కూడా రద్దు కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. కోనార్క్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటల సమయంలో ఉన్నప్పటికీ ఎప్పుడూ ఆలస్యంగా వస్తుంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. అనకాపల్లి మీదుగా విశాఖ నుంచి ఉదయం ఏడు గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వెళ్లిన తరువాత 7.55 గంటలకు విశాఖ - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. ఈ రైలులో పట్టణ వాసులతో పాటు అనకాపల్లి చుట్టు పక్కల నియోజకవర్గాల ప్రయాణికులు కూడా తుని, అన్నవరం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ ప్రాంతాలకు అధిక సంఖ్యలో వెళ్లేవారు. ఈ రైలు ప్రస్తుతం రద్దు కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. తరువాత తొమ్మిది గంటలకు బొకారో ఎక్స్‌ప్రెస్ ఉండగా మళ్లీ మధ్యాహ్నం పన్నెండున్నర వరకు రైళ్లు విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులకు అందుబాటులో ఉండడం లేదు. రైళ్లల్లో తక్కువ చార్జీలతో ప్రయాణం సుఖవంతంగా ఉంటుంది. అదే ఆర్టీసీ బస్సుల్లో రెట్టింపు చార్జీలకు పైగా ప్రయాణం ఖర్చులు అవుతుంటాయి. రైళ్లలో విశాఖపట్నం వెళ్లేందుకు కేవలం రూ.30లతో చేరుకోవచ్చు. అదే ఆర్టీసీ బస్సు అయితే రూ.60లు చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ చార్జీలు పెరగడం వల్ల ప్రయాణికులు రైళ్లల్లో ప్రయాణించడానికి మొగ్గు చూపుతున్నారు. అయితే గత కొంతకాలంగా ఈ రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు, దూరప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు.

మాకవరపాలెం మండలంలో పెరిగిన ఓటింగ్

మాకవరపాలెం, మే 16 : సార్వత్రిక ఎన్నికల్లో మాకవరపాలెం మండలంలో ఓటర్లు పోటెత్తారు. ఉదయం ఆరున్నర గంటల నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద క్యూకట్టారు. మండల వ్యాప్తంగా 46,406 మంది ఓట్లు ఉండగా, 40,058 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందుకోసం మొత్తం 59 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు. వజ్రగడ పోలింగ్ బూత్ 204లో 957 మంది ఓటర్లక 822 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆలాగే, 205లో 783కి, 668, 206లో 743కి 664. గంగవరం 207లో 645కి 583, 208లో 851కి, 777, కొండల అగ్రహారం 209లో 675కి 618, 210లో 717కి 619, 211లో 797కి 720, మల్లవరం 212లో 936కి 809, గిడుతూరులో 213లో 1011కి 755మంది ఓట్లు వేశారు. ఆదేవిధంగా పోలింగ్ బూత్ 214లో 920కి 750, 215లో 705కి 582, బయ్యవరం 216లో 267కి 225, 217లో 877కి 768, మాకవరపాలెం 218లో 731కి 605, 219లో 912కి 725, 220లో 464కి, 423, 221లో 649కి 535ఓట్లు పోలయ్యాయి. బూత్ 222లో 805కి 632, 223లో 640కి 530, పైడిపాల 224లో 644కి 535, 225లో 668కి 580, లచ్చన్నపాలెం 226లో 867కి 761, 227లో 838కి 727, 228లో 1006కి 909, పెద్దిపాలెం 229లో 1259కి 1072, బూరుగుపాలెం 230లో 653కి 560, 231లో 711కి 589, 232లో 679కి 520, పాపయ్యపాలెం 234లో 986కి 882, తాడపాల 235లో 1048కి 923, అప్పన్నదొరపాలెం 236లో 413కి 364, కొత్తతూటిపాల 237లో 921కి 799, 238లో 649కి 547, 239లో 750కి 640, మామిడిపాలెం 240లో 930కి 788, జెడ్.గంగవరం 241లో 688కి 621, శెట్టిపాలెం 242లో 1133కి 1027, భీమబోయినపాలెం 243లో 1200కి 1067, రాచపల్లి 244లో 913కి 826, 245లో 990కి 860, 246లో 876కి 755, రామన్నపాలెం 247లో 712కి 635, యరకన్నపాలెం 248లో 761కి 629, తామరం 249లో 663కి 581, 250లో 737కి 632, 251లో 853కి 727. పీపీఅగ్రహారం 252లో 836కి 715. బీఎస్‌పేట 253లో 698కి 656, జంగాలపల్లి 254లో 810కి 732, 255లో 721కి 653, జి.కోడూరు 256లో 853కి 734, 257లో 762కి 641, 258లో 1149కి 964, నగరం 259లో 754కి 661. జి.వెంకటాపురం 260లో 694కి 616, 261లో 341కి 291, బూత్ 262లో 400మంది ఓటర్లకు 372 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చినుకుపడితే వాహనదారులకు చిక్కులే!

- అస్తవ్యస్తంగా మారిన పలు గ్రామాల రహదారులు
- ఎక్కడికక్కడ గోతులు పడడంతో వర్షపు నీరు చేరి మరిన్ని ఇబ్బందులు



ఏఎల్‌పురంలో సీసీరోడ్డుపై నిలిచిన వర్షపునీరు

కృష్ణాదేవిపేట, మే 16 : చినుకు పడితే చాలు గ్రామీణ ప్రాంత రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. అందునా గొలుగొండ మండలంలో పలు గ్రామాల రహదారుల దుస్థితి మరీ దారుణంగా ఉంది. ఇందుకు కారణం రహదారులకు ఇరువైపులా సరిగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమేనని అంటున్నారు. దీంతో ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో గల సీసీ, తారురోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. దీనికితోడు రహదారుపై చాలాచోట్ల గోతులు పడడంతో అందులో వర్షపునీరు చేరుతుండడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పాత కృష్ణాదేవిపేట, పల్లావూరు, రామచంద్రపురం, కొంగసింగి, ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రయాణమంటేనే వర్షాలు కురిసినప్పుడు హడలిపోతున్నారు. రాత్రివేళ రోడ్లపై గోతులు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేని పలువురు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

చోడవరం
నియోజకవర్గం

చిరు జల్లులతో ఉపశమనం

బుచ్చెయ్యపేట,మే 16 : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం పడింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడడంతో రెండు రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం చెరకు, సరుగుడు, ఆయిల్ పామ్ పంటలకు ఉపయోగకరమని రైతులు తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



పరికరాల గురించి రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

రావికమతం, మే 16 : పంటల సాగులో రైతులు ఆధునిక పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని స్నైకాస్ వ్యవసాయ కళాశాల ఏడీ డా. మోషే అన్నారు. గురువారం మత్సవానిపాలెం గ్రామంలో కొండేంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నైరా, స్నైకాస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వ్యవసాయం, పని అనుభవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ గ్రామీణ రైతులు పంటల సాగులో ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకోవడానికి ఇదో మంచి అవకాశమన్నారు. పంటల సాగులో అధికంగా రసాయనాలు వినియోగించడం వల్ల కలిగే అనార్థాలను రైతులకు వివరించారు. సాగులో నూతన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడితో పాటు సాగు వ్యయం ఆదా అవుతుందన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం (కొండేంపూడి) ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు చర్చాగోషల్, డాఎస్. సత్తిబాబు, డా ఎస్. కిషోర్ వ్యవసాయ పరికరాల వినియోగంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేష్, ఏఓ రూప, తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే నరకమే

- చోడవరం పట్టణంలో పూడికలతో నిండిన కాలువలు
- వర్షం పడితే రోడ్లపైకి వస్తున్న మురుగు
- నిధులు విడుదలలో జాప్యంతో నిలిచిన పనులు





పూర్ణా థియేటర్, బాలాజీనగర్‌లో రోడ్డులో నిలిచిన వర్షం నీరు

చోడవరం, మే 16 : పట్టణ ప్రజలకు వానా కాలం కష్టాలు మొదలయ్యాయి. వీధుల్లోని కాలువలు పూడికపోవడంతో ఏమాత్రం వర్షం పడినా ఆ నీరు పొంగి రోడ్లపైకి వస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వార్డుల్లో కాలువలు, రోడ్ల అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పనులు పట్టాలెక్కకపోవడంతో స్థానికులకు కష్టాలు తప్పడం లేదు. పట్టణంలో దాదాపుగా ప్రతి కాలనీలోనూ కాలువలు పూడికపోవడం, కొన్నిచోట్ల కబ్జాకు గురికావడం వంటి సమస్యలతో వర్షాకాలంలో వరద నీరు రోడ్లపైకి, సమీపంలోని ఇళ్లల్లోకి రావడం పరిపాటిగా మారిపోయింది. రోజుల తరబడి వర్షం నీరు రోడ్లపై నిల్వ ఉండిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి ఎక్కువగా బాలాజీనగర్, కోఆపరేటివ్ కాలనీ, పూర్ణా థియేటర్ రోడ్డు, బానయ్యకోనేరు ప్రాంతాల్లో ఉంది. స్థానిక సమస్యల పరిష్కారానికి వీలుగా ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో కాలువలు, రోడ్ల అభివృద్ధికి రూ.20 లక్షల మేర నిధులు మంజూరు చేస్తున్నట్టు వైసీపీ నేతలు గొప్పగా ప్రకటించారు. కానీ పనులు మాత్రం చేపట్టలేదు. గతంలో చేసిన పనులకే బిల్లులు లేకపోవడంతో చాలామంది కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ముందుకు రాలేదు. దీంతో ఒక్క చోడవరం మేజర్ పంచాయతీలోనే 2 కోట్ల మేర పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణంలోని వీధుల్లో సమస్యలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇంటింటికీ కొళాయి పేరుతో అడ్డదిడ్డంగా తవ్వేసిన రోడ్లతో వీధుల్లో పరిస్థితి మరింత దిగజారిపోయింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడం వీధుల్లో వాననీరు పోయేదారి లేక రోడ్లపై ఉండిపోతున్నది. ఇదే సమయంలో చాలాచోట్ల తమ పనుల కోసం కాల్వలను కప్పేసి మరీ పనులు చేస్తుండడంతో కాల్వల్లో నీరు బయటకు పోయేదారి లేకుండాపోతున్నది.పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో చాలామంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో స్థానికులకు వానా కాలం కష్టాలు తప్పనిసరిగా మారిపోయింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధుల్లోని కాలువల్లో పూడికతీతలతో పాటు, కాలువల కబ్జాలను కూడా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడుగురు హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

చీడికాడ, మే 16 : మండలంలో ఏడుగురు హెచ్‌ఎంలకు డీఈఓ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాడు నేడు పథకం కింద రెండవ ఫేజ్‌లో 14 పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో ఏడు పాఠశాలల్లో కనీసం 50 శాతం కూడా పనులు పూర్తి చేయకపోవడంతో డీఈఓ వెంకటలక్ష్మమ్మ ఆయా హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఇందులో ఐదుగురు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఒక యూపీ స్కూల్, ఒక ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం ఉన్నారు. తురువోలు హైస్కూల్‌కు రూ.61 లక్షలు మంజూరు చేయగా రూ.26.52లక్షలు విడుదల చేశారు. ఖండివరంలో రూ.1.16కోట్లు మంజూరు చేయగా 38.81 లక్షలు నిధులు విడుదల చేశారు. భైలపూడిలో రూ.41లక్షలు మంజూరుచేయగా రూ.16.02లక్షలు విడుదల చేశారు. చుక్కపల్లిలో రూ.1.30కోట్లు మంజూరు చేయగా రూ.41.58 లక్షలు విడుదల చేశారు. వరహాపురంలో రూ.62లక్షలు మంజూరు చేయగా రూ.22.75లక్షలు విడుదల చేశారు. అడవి అగ్రహారం యూపీ స్కూల్‌కు రూ.19లక్షలు మంజూరు చేయగా రూ.7.95 లక్షలు విడుదల చేశారు. చెరుకుపల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.33లక్షలు మంజూరుచేయగా రూ.8.65 లక్షలు విడుదల చేశారు. ఈ పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, పెయింటింగ్, ప్రహరీ నిర్మాణాలు తప్ప మిగతా పనులు చేయాలని అధికారులు నిధులు విడుదల చేశారు. నిర్మాణాలను ఈఏడాది జూన్ 30 నాటికి పూర్తి చేయించాలని రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేయగా ఇప్పటికి 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో ఆయా పాఠశాలలను గుర్తించిన విద్యా శాఖాధికారులు ఈ ఏడు హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వెంటనే సమాధానం చెప్పాలని ఆదేశించారు.కాగా పనుల జాప్యంపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో చీడికాడ ఎంఈవో గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిర్మాణాల్లో జాప్యం, బిల్లుల చెల్లింపు, నిధుల ఖర్చుపై సమగ్రంగా చర్చించారు.

షోకాజ్ నోటీసులు దురదృష్టకరం : ఏపీటీఎఫ్

బుచ్చెయ్యపేట : జిల్లాలో రెండవ దశ నాడు-నేడు పనుల్లో జాప్యానికి హెచ్‌ఎంలను బాధ్యులను చేస్తూ డీఈఓ వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేయడం దురదృష్టకరమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, కార్యదర్శి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. విద్యా శాఖ రాష్ట్ర పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన విభాగం కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించకుండా పనుల్లో పురోగతి తక్కువగా ఉందని రాష్ట్ర వ్యాప్తంగా 227 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం హెచ్‌ఎంలను కించపరచడమేనని చెప్పారు. పనులకు సిమ్మెంట్, నిధులు ఇవ్వకుండా ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. వేసవి సెలవుల్లో కూడా హెచ్‌ఎంలు నాడు-నేడు పనులు చేస్తున్నారని తెలిపారు.

న్యాయం చేసే వరకూ పోరాటం

రోలుగుంట, మే 16 : మండలంలోని జేపీ అగ్రహారంలో ప్రభుత్వ భూముల సరిహద్దులను నిర్ణయించడానికి గురువారం గ్రామానికి వచ్చిన రెవెన్యూ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి సాగు అనుభవంలో ఉన్న జిరాయితీ భూములపై మూడు గ్రామాలకు చెందిన 400 మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వీటిపై కొంతమంది దళారులు కన్ను పడడంతో ఇనామ్ భూమిగా రికార్డులు సృష్టించి, అడ్డదారుల్లో పాసు పుస్తకాలు పొందారని చెప్పారు. 2021 ఆగస్టు 14, 15 తేదీల్లో సెలవు అయినప్పటికీ నాటి తహసీల్దార్ బదిలీ అయి రిలీవింగ్ అయినప్పటికీ దళారులకు రాత్రికి రాత్రే ఆఘమేఘాల మీద మ్యూ టేషన్లు చేసి పాసు పుస్తకాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయమై రెండుసార్లు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అధికారులే తమకు న్యాయం చేయాలని కోరారు.

రేపటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

మాడుగుల, మే 16 : మాడుగులలోని వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి శుక్రవారం వరకూ జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నున్న శ్రీనివాసాచార్యులు, ఆరవెల్లి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నట్టు చెప్పారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న వ్యాపారులు

కె. కోటపాడు, మే 16 : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం వర్షం కురిసింది. తెల్లవారు జాము నుంచీ వాతావరణం చల్లగా ఉండడంతో పాటు చిరు జల్లులు పడడంతో ప్రజలు ఎండల తీవ్రత నుంచి కాస్త ఉపశమనం పొందారు. చిరు జల్లులు వల్ల చిరు వ్యాపారులు, వాహనదారులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. ఈ వర్షం ఆకు మడుల దుక్కులకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.

బోసిపోయిన కోనాం సంత

చీడికాడ : మండలంలోని చీడికాడ, కోనాంతో పాటు పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓ మోస్తరుగా వర్షం పడింది. కోనాంలో జరిగిన సంతకు ఏజెన్సీ, మైదాన ప్రాంతాల నుంచి రైతులు, కొనుగోలుదారులు రాక చిరు వ్యాపారులు నిరాశకు గురయ్యారు.

మాడుగుల/రూరల్ : మాడుగులలో తేలికపాటి జల్లులు కురిసాయి. దీంతో ప్రజలు ఎండల తీవ్రత నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ చినుకులు పడగా రెండు గంటల తరువాత మళ్లీ ఎండ కాయడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడారు.

మాడుగుల
నియోజకవర్గం



ర్యాలీలో పాల్గొన్న పినకోట వైద్య సిబ్బంది

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

దేవరాపల్లి, మే 16 : ప్రజలు డెంగీ జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యులు సూచించారు. గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పినకోట, దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జి. వెంకటేష్, డి. రూప్‌చంద్, వనజ, ఎంపీహెచ్ఈఓ గంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ రవి, పర్యవేక్షకురాలు సావిత్రి, ఆప్తాలమిక్ అధికారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

వాకపల్లిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

దేవరాపల్లి, మే 16 : మండలంలోని వాకపల్లి సాయిరాం మందిరంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. వైద్యులు 52 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రతి వారం సాయిరాం ఆలయ ధర్మకర్తలు మల్ల జగన్నాథరావు, పార్వతి దంపతులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు.

35 మందికి వైద్య పరీక్షలు

చీడికాడ, మే 16 : మండలంలోని కోనాం సబ్ సెంటర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చీడికాడ పీహెచ్‌సీ వైద్యులు 35 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ జి. వెంకటరావు మాట్లాడుతూ వేసవి పూర్తయ్యే వరకూ ఎండలకు దూరంగా ఉండి, ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ మొల్లి వరలక్ష్మి, ఏఎన్ఎం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ వాగులనూ మింగేశారు!

... 5వ పేజీ తరువాయి

ఆనుకొని సర్వే నంబరు 103లో ప్రైవేటు భూమి ఉంది. ఆ ప్రైవేటు భూమిని లేఅవుట్‌గా చేసి, పక్కనే ఉన్న సర్వే నంబరు 77లోని గెడ్డ వాగు స్థలం ఆక్రమించి జిరాయితీతో కలిపి లేఅవుట్ వేసి అమ్మేసుకున్నారు. దీనిని మూడేళ్ల క్రితం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో జీవీఎంసీ, రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పోలీసుల సహాయంతో ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణాలు కూల్చివేశారు. మళ్లీ ఇప్పుడు అక్కడ ప్రహరీ నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల్లోని కింది స్థాయి ఉద్యోగుల అండదండలతో ఆక్రమార్కులు రెచ్చిపోతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.